ఆంధ్రజ్యోతి
నంద్యాల
మంగళవారం 15 అక్టోబరు 2024

ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

ఆరు షాపులను దక్కించుకున్న మహిళలు

నంద్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న మద్యం దుకాణాలకు సంబంధించిన లాటరీ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 105 మద్యం దుకాణాలకు వచ్చిన 2221 దరఖాస్తులు వచ్చాయి. ఇలా వచ్చిన వాటిని ఒక్కో దుకాణానికి సంబంధించిన దరఖాస్తులను వడపోసి లాటరీ తీశారు. లాటరీలో దుకాణాలను దక్కించుకున్న వారు 48 గంటల్లో ఆరో వంతు లైసెన్స్ ఫీజు చెల్లించి వ్యాపారాలు ప్రారంభించుకోవచ్చని ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. లాటరీ ప్రక్రియను నంద్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలోని సెంటినరీ హాలులో జరిపించారు. ఈ ప్రక్రియలో ఆరుగురు మహిళలు దుకాణాలను దక్కించుకున్నారు.

సర్కిళ్ల వారీగా..

జిల్లా వ్యాప్తంగా ఏడు ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. వీటిలో నంద్యాల సర్కిల్‌లో 24 దుకాణాలు ఉండగా వీటికి 735 దరఖాస్తులు వచ్చాయి. అలాగే బనగానపల్లె సర్కిల్‌లో 12 దుకాణాలకుగాను 168 దరఖాస్తులు, ఆళ్లగడ్డ సర్కిల్‌కు సంబంధించి 19 దుకాణాలకు గాను 326, డోన్ సర్కిల్‌కు సంబంధించి 16 దుకాణాలకు గాను 386, కోవెలకుంట్ల సర్కిల్‌లోని 11 దుకాణాలకుగాను 150, నందికొట్కూరు సర్కిల్‌లోని 10 దుకాణాలకు 182 దరఖాస్తులు, ఆత్మకూరు సర్కిల్‌లోని 13 దుకాణాలకు 273 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన జిల్లాలోని దుకాణాలకు సగటున 21 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు ఉదయమే లాటరీ తీసే సెంటినరీ హాలుకు రావాలని అధికారులు ఆదేశించటంతో నంద్యాల - ఆళ్లగడ్డ రహదారి ఉదయం నుంచే కిటకిటలాటింది. ఆశవహులు వచ్చిన తర్వాత అధికారులు దరఖాస్తులను సర్కిళ్ల వారీగా లాటరీ తీశారు. మద్యం దుకాణాలకు టెండర్లలో మహిళలు కూడా పాల్గొనగా వీరిలో ఆరుగురికి దుకాణాలు దక్కించుకున్నారు.

మిగతా 6లో..



లాటరీ తీస్తున్న కలెక్టర్ రాజకుమారి



లక్కీ డిప్‌కు హాజరైన దరఖాస్తుదారులు



కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం

కార్తీక మాసమంతా స్వామివారి గర్భాలయ అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీక మాసోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టాలని అన్ని విభాగాల అధిపతులను ఆదేశించారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తీకపౌర్ణమి, శుద్ధ, బహుళ ఏకాదశులు, ప్రభుత్వ సెలవు రోజులలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఏర్పాట్లలో భాగంగా భక్తులకు వసతి, మంచి నీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, స్వామి, అమ్మవార్ల ఆర్జితసేవలు, ఆలయ వేళలు, కార్తీక సోమవారాలలో లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తీకపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం, ఆకాశదీపం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, క్యూలైన్ల నిర్వహణ, రద్దీ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, పార్కింగ్, మొదలైన వాటి గురించి సమావేశంలో చర్చించారు. అలాగే పాతాళగంగ వద్ద శౌచాలయాలు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు, క్షేత్రపరిధిలోని శౌచాలయాలు, జలప్రసాద కేంద్రాలకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలన్నారు.

మిగతా 6లో..



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు, పాల్గొన్న అధికారులు

చాగలమర్రిలో ఓ మోస్తరు వర్షం

● తడిసిన మొక్కజొన్న ధాన్యం ●ఆందోళనలో రైతులు



చాగలమర్రి సర్వీసు రహదారిలో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం పట్టలపై నిలిచిన వర్షపు నీరు

చాగలమర్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చాగలమర్రిలో మోస్తరు వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటను నూర్పిడి చేసి విక్రయించి సొమ్ము చేసుకునే సమయంలో తుఫాన్ దెబ్బతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చాగలమర్రి, పెద్దబోదనం, గొడిగనూరు, శెట్టివీడు తదితర గ్రామాల రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యంపై వర్షపు నీరు నిలిచి దెబ్బతిందని రైతులు వాపోతున్నారు. మెట్ట పొలాల్లో సాగు చేసిన మినుము, వరి, కంది, ఉల్లి తదితర పంటలకు ఈ వర్షం జీవం పోసిందని కొందరు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనగ విత్తనం వేసేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్

ఫోన్ నెంబర్లు 08514-293903-08514-293908

నంద్యాల కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా నంద్యాల కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని కలెక్టర్ రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమండ్ కంట్రోల్ రూమ్ ఫోన్‌నెంబర్లు 08514-293903, 08514-293908ను ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు మూడు షిఫ్టులలో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేశామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ఉండే మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

శ్రీశైలానికి భారీగా వరద

శ్రీశైలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసా గుతోంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 52,627 క్యూసెక్కులు, సుకేలుల నుంచి 90,494 క్యూసెక్కులు మొత్తం 1,43,121 వరద నీరు వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,27,548 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్ర స్తుత నీటి మట్టం 882.50 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,642 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు మొత్తం 65,957 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

నాణ్యత తక్కువ.. ధర ఎక్కువ



- నాసిరకంగా పప్పు శనగ విత్తనాలు
- ప్రభుత్వం వ్యాపారులకు ఇచ్చేది క్వింటాకు రూ.9 వేలు
- బహిరంగ మార్కెట్‌లో రూ.7 వేలకే లభ్యం
- ఉమ్మడి జిల్లాకు రూ.71,955 క్వింటాళ్ల కేటాయింపు
- ఖర్చులు పోను వ్యాపారులకు క్వింటాపై రూ.1500 మిగులు
- 71 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలపై రూ.10.79 కోట్ల లాభం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రబీలో రాయితీపై పప్పు శనగ విత్తనాలను సప్లయ్ చేసేందుకు రూ.71,955 క్వింటాళ్లు కేటాయించారు. ఇందుకోసం క్వింటానికి రూ.9 వేల చొప్పున వ్యాపారులకు చెల్లించేలా నిర్ణయించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన పప్పు శనగ విత్తనాల ధర క్వింటానికి రూ.7 వేలు మాత్రమే లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే.. ప్రభుత్వం వ్యాపారులకు క్వింటానికి రూ.9 వేలు చెల్లిస్తూ తీసుకున్న నిర్ణయం వెనుక రాజకీయ నాయకుల హస్తం స్పష్టంగా కనిపిస్తోందని రైతు సంఘాల ప్రతినిధులు ధ్వజమెత్తుతున్నారు. అంత పెద్ద మొత్తంలో ధర చెల్లించినా కనీసం మంచి విత్తనాలనైనా అందిస్తున్నారా అంటే అదీ లేదు. ఆస్పరి మండల కేంద్రంలో బుధవారం ఏపీ సీడ్స్ సంస్థ సప్లయ్ చేసిన శనగ విత్తనాలు నాణ్యతగా లేవని నిర్ధారించిన వ్యవసాయ శాఖ అధికారులు వాటిని వెనక్కు పంపించేశారు. అదేవిధంగా నందికొట్కూరు నుంచి కర్నూలు డివిజన్‌కు సప్లయ్ చేసిన 150 క్వింటాళ్ల శనగ విత్తనాలు నాణ్యతగా లేకపోవడంతో ఏడీఏ శాలురెడ్డి ఈ విత్తనాలు తమకు వద్దని వెనక్కు పంపించేశారు. చాలా చోట్ల నాసిరకం శనగ విత్తనాలపై రైతులు ఆరోపణలు చేస్తున్నారు. ఆస్పరిలో విక్రయిస్తున్న నాసిరకం శనగ విత్తనాలను కడప నుంచి తెప్పించినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. తమకు నాసిరకం విత్తనాలను ప్రభుత్వమే అంటగడుతుంటే.. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

మిగతా 7లో..

చిరుత సంచారం

● భయాందోళనలో ప్రజలు ● పరిశీలించిన ఫారెస్టు అధికారులు

మిడుతూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ పరిసర ప్రాంతంలో చిరుత రెండు రోజులుగా సంచరిస్తుండడంతో సమ్మర్ స్టోరేజ్ వర్కర్లు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి డ్యూటీ నిమిత్తం సమ్మర్ స్టోరేజ్ కాంట్రాక్టర్ ఉద్యోగి బాష రాగా వాటర్ బెడ్ల వాల్‌పై కూర్చొని ఉన్న చిరుతను చూసి భయాందోళనతో బైక్‌పై ఇంటికి వెళ్లి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధి కారులు సోమవారం సమ్మర్ స్టోరేజ్ వద్దకు చేరుకుని చిరుత అడుగుల జాడలను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చిరుత జాడ తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని డీఆర్‌వో జిహన్ తాహేర్ తెలిపారు. స్థానికులు భయాందోళన చెందుతున్నారు.



సమ్మర్ స్టోరేజ్ వద్ద చిరుత అడుగు జాడలు

పేదోడి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

●మంత్రి ఫరూక్



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదోడి ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల లక్ష్యమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాలలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో అన్న క్యాంటీన్లను రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి, అధికారులు అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించే క్రమంలో మొదటి విడతలో 100, రెండవ విడతలో 75 క్యాంటీన్లను ప్రారంభించిందన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రూ.5కే భోజనం పెడుతున్నామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు అన్నింటినీ నెరవేరుస్తామని ఆయన అన్నారు. నాలుగు నెలల కూటమి పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, నిరుద్యోగ యువతకు ఉపాధి లక్ష్యంగా పాలన సాగిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు, సీపీలు సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, మున్సిపల్ అధికారులు, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించండి

- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



అర్జీదారులనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)లో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ఫిర్యాదుదారులనుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలనుంచి అందిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని, ఫిర్యాదులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. 30 మంది ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దూరప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు ప్రతి సోమవారం దగ్గరలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వినూత్నం

విమాన భోజనంబు..!

వినూత్న రీతిలో హోటల్

ఆకట్టుకుంటున్న దూపాడు ఎయిర్‌బస్

విమానం ఎక్కి విహంగ ప్రయాణం చేయాలని ఎవరికి ఉండదు. విమానంలో ప్రయాణిస్తూ ఇష్టమైన ఫుడ్‌ను ఆర్డర్ చేసి విమాన కిటికీల్లోంచి నగరాన్ని చూడాలని ఎవరికైనా ఉంటుంది. మధ్యతరగతి కుటుంబాలకు ఇవన్నీ నెరవేరడం అసాధ్యం అనుకుంటున్నారు కదూ! డబ్బులుంటే అవేవీ తీరని కోరికలు కావని అంటున్నారు ఎయిర్‌బస్ రెస్టారెంట్ నిర్వాహకులు. విమానం ఎక్కిన అనుభూతి కలిగేలా ఉన్న రెస్టారెంట్ ఇప్పుడు కర్నూలు నగర ప్రజలను ఆకట్టుకుంటోంది.

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్స్, హోటల్స్ అనగానే ప్రధాన రోడ్ల వెంట రంగు రంగుల లైటింగ్‌తో కొత్తగా కస్టమర్లను ఆకట్టుకోవడానికి నిర్వాహకులు విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. పిల్లలు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలతో పాటు అన్నివర్గాల వినియోగదారులను కట్టిపడేయడానికి వినూత్న రీతిలో ఆలోచిస్తుంటారు. కర్నూలు నగరానికి 7 కిలోమీటర్ల దూరంలో బెంగళూరు జాతీయ రహదారి దూపాడులో ఎయిర్‌బస్ రెస్టారెంట్ ప్రస్తుతం ట్రెండీగా నిలిచింది. పెద్దపెద్ద నగరాలు, మెట్రో సిటీలకే పరిమితమైన విలాసవంతమైన ఎయిర్‌బస్ రెస్టారెంట్‌ను కర్నూలు జిల్లా ప్రజలకు చేరువ చేశారు నిర్వాహకులు హఫీజ్. దాదాపు రూ.2కోట్లతో విమానాన్ని కొనుగోలు చేశారు. ఢిల్లీ నుంచి రోడ్డు మార్గాన ఈ విమానం చేరుకోవడానికి 20 రోజులు సమయం పట్టినట్లు మేనేజర్ సయ్యద్‌అబ్బాస్ వివరించారు. మొత్తం మూడు ఎకరాల్లో కర్నూలు సిటీ ఆన్ వింగ్స్ ఆధ్వర్యంలో కర్నూల్ ఫస్ట్ ఎయిర్‌బస్‌ను నెలకొల్పారు. పట్టణ ప్రజల ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా విలాసవంతమైన కర్నూలు ఫస్ట్ ఎయిర్‌బస్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు నిర్వాహకులు. బర్త్‌డే మొదలుకుని ఎలాంటి ఫంక్షన్లు అయినా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారుల కోసం గేమింగ్ జోన్, ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్లగానే ఎయిర్‌హోస్టెస్‌తో స్వాగతం మొదలుకుని అన్నీ నిజమైన విమానంలో ఉన్నట్టే అనుభూతి కలిగిస్తుంది. అన్నట్టు ఈ హోటల్ ఫ్లైట్‌ను ఎక్కాలంటే బోర్డింగ్ పాస్ తప్పనిసరి మరి.













మందుబాబుపైకి కొండ చిలువ



మందుబాబుపై పాకుతున్న కొండచిలువ

అవుకు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన మైకంలో ఉన్న ఓ వ్యక్తి తనపైకి కొండచిలువ పాకినా పట్టించుకోలేదు. శింగనపల్లె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ డ్యూటీ దిగి ఫుల్‌గా మద్యం సేవించాడు. మద్యం మత్తులో తూగుతూ గ్రామంలోని బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోకి చేరుకున్నాడు. సరిగా నడవలేని స్థితిలో అక్కడే ఉన్న ఓ అరుగుపై కూర్చున్నాడు. సమీపంలోని పొదల్లో నుంచి వచ్చిన ఓ కొండచిలువ ఏకంగా ఆ వ్యక్తిపైకి పాకుతూ మెడపైకి వెళ్లింది. అక్కడి నుంచి కిందికి పాకుతున్నా స్పర్శ లేకుండా ఉన్న మందుబాబును స్థానికులు గమనించారు. కట్టెలతో కొండ చిలువను పక్కకు లాగేయడంతో కొండ చిలువ పొదల్లోకి వెళ్లిపోయింది.

పునఃప్రారంభం కానున్న ప్రత్యేక రైళ్లు



ఆదోని టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు అయిన రెండు ప్రత్యేక రైళ్లను ఈనెల 17వ తేదీ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. బెళగావి నుంచి మునుగురు వరకు వెళ్లే రైలు (07335)ను 16న తేదీ నుండి ప్రతి ఆది, బుధ, శని, మంగళవారాల్లో నడుస్తాయన్నారు. అదేవిధంగా మునుగురు నుంచి బెళగావి వరకు వెళ్లే రైలు (07336) 17వ తేదీ నుంచి ప్రతి సోమ, గురు, ఆది, బుధవారాల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు నడిచే ఈ ప్రత్యేక రైళ్లు ఖానాపూర్, లోండా, అల్నావర్, ధార్వాడ, హుబ్బళ్లి, గదగ్, కొప్పల్, హోస్పెట్, తోర్నగల్, బళ్ళారి, గుంతకల్లు, ఆదోని, కోసిగి, మంత్రాలయం రోడ్, రాయచూరు, కృష్ణ, యాదగిరి మీదుగా భద్రాచలం రోడ్ వరకు వెళ్తుందని అధికారులు తెలిపారు.

శనగ విత్తనాల పంపిణీపై శ్రద్ధ ఏదీ..?

● జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60 నుంచి 80 శాతం మంది రైతులు సాగు చేసే శనగ విత్తనాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపించడం లేదని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో విత్తనాలను పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు విత్తనాలు దక్కడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో మెజారిటీ మండలాల్లో నేటికి నాణ్యమైన శనగ విత్తనాలను పంపిణీ చేయలేదన్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందన్నారు. నేటి వరకు నయాపైసా కూడా అందించలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.9,400 నిర్ణయించి 25 శాతం సబ్సిడీతో రైతులకు ఒక క్వింటాకు రూ.7,050 చొప్పున అందిస్తోందన్నారు. ప్రస్తుతం డబ్బు చెల్లించినా పది రోజుల కు కూడా విత్తనాలు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. గత సెప్టెంబరు 25వ తేదీ నాటికి రైతాంగానికి అవసరమైన శనగ విత్తనాలను అందుబాటులోకి ఉంచుకోవాలని జడ్పీ స్థాయి సంఘం సమావేశాల్లోనే వ్యవసాయ శాఖ అధికారులను కోరామన్నారు. అయినా అధికారులు ఆ దిశగా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

ముగిసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ

(5వ పేజీ తరువాయి)

ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రైవేటు దుకాణాలకు గేట్లు తెరవటంతో చాలా మంది మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపారు. దీంతో ఎలాగైనా షాపును దక్కించుకునేందుకు కొంతమంది సిండికేట్ అయ్యారు. అందరూ కలిసి దరఖాస్తులు వేసి ఎవరికి వచ్చినా వ్యాపారాన్ని అందరూ కలిసి చూసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక కొంతమంది తాము ఒక్కరే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వేసుకున్నారు. అయితే ఇలా సిండికేట్ అయిన వారికి గాని, ఆశతో ఎక్కువ దరఖాస్తులు వేసిన వారికి గాని దుకాణాలు దక్కకపోవటంతో ఉసూరుమన్నారు. నందికొట్కూరులోని పది దుకాణాలకు వైసీపీ నాయకులు సిండికేట్‌గా మారి 12 దరఖాస్తులు వేశారు. అలాగే నందికొట్కూరుకు చెందిన ఓ వైసీపీ నేత ఒకే దుకాణానికి నాలుగు దరఖాస్తులు సమర్పించినా దుకాణం దక్కలేదు. అలాగే డోన్ సర్కిల్ పరిధిలోని చాలా మంది వైసీపీ నాయకులు సిండికేట్‌గా మారి దరఖాస్తులు సమర్పించారు. అలాగే టీడీపీ నేతలు కూడా సిండికేట్‌గా మారి దరఖాస్తులు వేసినా దుకాణాలను దక్కించుకోలేదు. నంద్యాల పరిధిలోని దుకాణాలకు కొంత మంది సిండికేట్‌గా మారి 18 దురఖాస్తులు వేసినా ఫలితం లేకపోయింది. ఇలా కోట్ల రూపాయలను సిండికేట్లు కోల్పోయారు. ఇక కొంతమంది ఒక్క దరఖాస్తు వేసినా అదృష్టం వరించటంతో దుకాణాలను దక్కించుకున్నారు. ఇక ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని ఓ వ్యక్తికి మూడు దుకాణాలు దక్కాయి. ఆళ్లగడ్డ సర్కిల్‌లోని ఓ హోంగార్డు భార్యకు దుకాణం దక్కింది. ఆ కుటుంబానికి ఇలా దుకాణం దక్కడం ఇది మూడోసారి కావటం గమనార్హం. అలాగే నంద్యాలకు చెందిన ఓ మహిళా పారిశ్రామికవేత్త కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కూడా మద్యం దుకాణాలు దక్కించుకున్నారు.



లక్కీ డిప్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

● **ప్రశాంతంగా..**

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతలు తీసుకున్నారు. నంద్యాల - ఆళ్లగడ్డ రహదారి చుట్టుపక్కల పోలీసులు ఆంక్షలు విధించారు. వాహనాల రాకపోకలకు దారి మళ్లించారు. సెంటినరీ హాలులోకి దరఖాస్తుదారులను మాత్రమే అనుమతించారు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారు. దీంతో లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.



కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై

సన్నాహక సమావేశం

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

వేకువ జామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి ప్రాతఃకాల పూజల అనంతరం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి 5:30 నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. కార్తీక మాసంలో సోమవారాలు, పర్వదినాలు, ప్రభుత్వ సెలవు రోజులు మినహా స్వామివారి సామూహిక అభిషేకాలను పరిమిత సంఖ్యలో అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

● **ఆర్జిత సేవలు**

కార్తీక మాసంలో సోమవారాలు, పర్వదినాలు, ప్రభుత్వ సెలవు రోజులు స్వామివారి సామూహిక అభిషేకం, గర్భాలయ అభిసేకాలను నిలుపుదల చేశారు. రెండు విడతలుగా ఆర్జిత హోమాలు నిర్వహించనున్నారు. రద్దీరోజులలో అమ్మవారి అంతరాలయంలో జరిపించే కుంకుమార్చనలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు.

అన్నప్రసాద వితరణ, లడ్డూ ప్రసాదాల విక్రయం

భక్తులకు అన్నదాన భవనంలో ఉదయం 10:45 నుంచి అన్నప్రససావ వితరణ, సాయంత్రం 6:30 గంటల నుంచి భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేయనున్నారు. కార్తీక మాసంలో భక్తుల రద్దీకనుగుణంగా అవసరమైన లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు కార్తీక దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడ వీధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. కార్తీక సోమవారాలలో పుష్కరి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణిహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్తీక పౌర్ణమి రోజున పాతాళగంగ వద్ద నెలకొల్పిన కృష్ణవేణి నదీమతల్లికి నవంబర్ 15న పుణ్యనదీహారతి కార్యక్రమం, కార్తీకపౌర్ణమి రోజున జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించనున్నారు.

పొత్తులో పోట్లాట

● ఆరేకల్లులో ఆగిన మధ్యాహ్న భోజనం
● ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల నిరసన
● వంట గదికి తాళం వేసిన కూటమి నాయకులు



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ఆరేకల్లు విద్యార్థులు

ఆదోని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదోని రాజకీయం అటు ఇటు తిరిగి విద్యార్థుల మధ్యాహ్న భోజనంపై పడుతోంది. కూటమి పొత్తు పోట్లాటతో ఎక్కడో ఒక చోట ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ఆదోని కూట మి ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ టీడీపీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఈ క్రమంలోనే ఆరేకల్లు మధ్యాహ్న భోజన ఏజెన్సీ జనసేనకు, ఫీల్డ్‌అసిస్టెంట్, డీలర్ తదితర పదవులు టీడీపీ, బీజేపీలకు కేటాయించారు. దసరా సెలవుల ముందు వరకు పాఠశాలలో వైసీపీ నాయకుడు తిమ్మారెడ్డి భార్య రాజేశ్వరి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించేది. జనసేనకు చెందిన తిమ్మప్ప మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వహిస్తాడని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా, సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు జనసేన వాళ్ల పాఠశాలలో వంట వండే ప్రసక్తే లేదని టీడీపీ నాయకులు పాఠశాల కెళ్లి వంట గదికి తాళం వేసి అక్కడే బైఠాయించారు. మధ్యాహ్నం 12.30 గంటలు కావస్తున్నా విద్యార్థులకు భోజనం పెట్టలేదు. జడ్పీ హైస్కూలులో మొత్తం 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు 450 మంది ఉండగా 50 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బాలికలు, బాలురు ఖాళీ ప్లేట్లతో పాఠశాల బయటకొచ్చి నిరసన తెలిపారు. తాము చిన్న పెండేకల్లు, పెద్దపెండేకల్లు, నాగలాపురం, తదితర సుదూర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చాం. తమకు అన్నం పెట్టకపోతే ఎలా అంటూ చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు చిప్స్ (కురుకురే)తిని, మరికొందరు నీళ్ల తాగి కడుపు నింపుకున్నారు.



వంట గదికి తాళం వేసిన కూటమి నాయకులు

ఆకలి తట్టుకోలేక నీళ్లు తాగినా

ఉదయం నుంచి పాఠశాల వద్ద రాజకీయ నాయకులు కొట్లాడుతున్నారు. ఒంటి గంట దాటినా అన్నం పెట్టలేదు. బిస్కెట్లు కొనుక్కొని తిందామన్నా డబ్బులు లేవు. ఆకలి తట్టుకోలేక నీళ్ల తాగి కడుపునింపుకున్నా.

-భాగ్యరాజు, 6వ తరగతి విద్యార్థి, ఆరేకల్లు

పస్తుండక తప్పదు

మధ్యాహ్న భోజనం పెట్టకపోతే ఎలా. మేము ఆడపిల్లలం. ఎక్కడికెళ్లి తింటాం. చదవుకొనే మాలాంటి విద్యార్థులతో రాజకీయాలు చేయడమేమిటి. ఇంటికెళ్లి తిందామన్నా మా ఊరు 10 కి.మీ. దూరంలో ఉంది. ఈ రోజు పస్తుండక తప్పదు.

-పెద్దపెండేకల్లు అమృత, 8వ తరగతి, ఆరేకల్లు

వంట వండకుండా అడ్డుకున్నారు....

పాఠశాలలో వంట వండే ఏజెన్సీ తిమ్మప్పకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మా సమస్య సమస్య పరిష్కారమయ్యే వరకు పాఠశాలలో వంటలు వండనివ్వమని గ్రామానికి చెందిన కొందరు వచ్చి అడ్డుకున్నారు. ఏం చేయాలో తెలియక పైస్థాయి అధికారులకు సమాచారం ఇచ్చాను.

-సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, ఆరేకల్లు



కురుకురే ప్యాకెట్లు తింటున్న విద్యార్థులు

నాణ్యత తక్కువ.. ధర ఎక్కువ..

శనగ విత్తనాల సేకరణలో గోల్‌మాల్




5వ పేజీ తరువాయి

ప్రస్తుత ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాకు 45,955 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 26 వేల క్వింటాళ్లు మొత్తం 71,955 క్వింటాళ్ల శనగ విత్తనాలను 20 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నందికొట్కూరు, కడపతోపాటు నంద్యాల ప్రాంతంలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు ఈ విత్తనాలను సప్లయ్ చేసేందుకు ఏపీ సీడ్స్ సంస్థ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి శనగ విత్తనాల ధరను పెద్ద ఎత్తున పెంచుకునేందుకు చేసిన ప్రయత్నాలకు కొంతమంది ముఖ్యమైన నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. వాస్తవంగా రైతులు చెబుతున్న వివరాల మేరకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం శనగ విత్తనాల ధర రూ.7 వేలు మాత్రమే ఉంది. అటువంటి సమయంలో వ్యాపారులకు క్వింటానికి రూ.9 వేలు చెల్లించి నాసిరకం విత్తనాలను రైతులకు అందించాల్సిన అవసరం ఏమిటని..? ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలకు వ్యాపారులు గుడ్‌విల్ చెల్లించినట్లు అర్థమవుతోందని రైతు సంఘాల ప్రతినిదులు ఆరోపిస్తున్నారు. క్వింటం శనగ విత్తనాలపై వ్యాపారులకు ప్రభుత్వం నిర్ణయించిన 9వేలను పరిగణనలోకి తీసుకుంటే ఖర్చులు పోను రూ.1,500లు మిగులుబాటు అవుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా మొత్తం మీద రూ.71,955 క్వింటాళ్లపై క్వింటానికి రూ.1,500 మిగులుబాటును లెక్కేస్తే రూ.17.79 కోట్లు వ్యాపారుల చేతికి దక్కుతోంది. ఈ మొత్తంలో 10 నుంచి 20 శాతం అధికారులకు, రాజకీయ నాయకులకు చెల్లించినా దాదాపు రూ.6 కోట్లకు పైగానే వ్యాపారుల జేబుల్లో పడినట్లే.

పెద్ద మొత్తంలో ధర చెల్లించినా నాణ్యమైన పప్పు శనగ విత్తనాలు కాకుండా మార్కెట్ యార్డులో తక్కువ ధరకే అంటే క్వింటానికి రూ.6,7 వేలకు కొనుగోలు చేసి రూ.9 వేలకు బేరాలు కుదుర్చుకుని ఏపీ సీడ్స్ సంస్థకు తగలగడుతున్న వ్యాపారులు కనీసం నాణ్యతతో కూడిన విత్తనాలనైనా సప్లయ్ చేయకపోవడంతో రైతుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పరి మండల కేంద్రంలో 250 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు నాసిరకం అని తేలడంతో బుధవారం

విత్తన నాణ్యత లేక తిప్పి పంపుతున్న అధికారులు



స్థానిక వ్యవసాయ అధికారులు వాటిని ఏపీ సీడ్స్ సంస్థకు వెనక్కు లారీ ద్వారా పంపించేశారు. అదేవిధంగా నందికొట్కూరులో సుభాని ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏ మాత్రం క్లీనింగ్ చేయని విత్తనాలు సప్లయ్ చేసినట్లు తేలింది. దీంతో కర్నూలు ఏడీఏ శాలురెడ్డి ఇంకోసారి నాణ్యత లేని విత్తనాలు తమకు సప్లయ్ చేయవద్దని ఏపీ సీడ్స్ సంస్థ అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు అందజేసే విత్తనాలు చెత్తాచెదారం రెండు శాతమే ఉండాలని 10.10 ఎంఎం సైజులో విత్తనాలు ఉండాలని, అదే విదంగా 85 శాతం(మొకల శాతం) జనరేషన్ ఉండాలని ఏడీఏ స్పష్టం చేశారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయండి



బయటి మార్కెట్‌లో క్వింటం శనగ విత్తనాల ధర రూ.7వేల లోపు ఉంది. అయితే ఏపీ సీడ్స్ సంస్థ రూ.9 వేలు చెల్లించి వ్యాపారుల నుంచి నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయడం దారుణం. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రాయితీపై అందించే వేరుశనగ, పప్పుశనగ విత్తనాల సప్లయ్‌లో వ్యాపారులు పెద్ద ఎత్తున లాభపడుతుంటే.. రైతులు మాత్రం దిగుబడి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నాణ్యమైన విత్తనాలనే అందిస్తాం



రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యత కలిగిన విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రాంతాల్లో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవం. ఆస్పరిలో నాసిరకం విత్తనాలని తేల్చి మా అధికారులు వెనక్కు పంపారు. ఈ వ్యవహారంపై ఏపీ సీడ్స్ సంస్థ అధికారులకు వివరణ ఇవ్వాలని లెటర్ రాశాం. నందికొట్కూరుతోపాటు కడప జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు శనగ విత్తనాలను ఏపీ సీడ్స్ సంస్థ అందిస్తోంది. నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. - వరలక్ష్మి, జేడీ, కర్నూలు.

పత్తి రైతు గుండెల్లో గుబులు

మళ్లీ మూడు రోజులపాటు వర్షాలు



ఎమ్మిగనూరు మండలంలో సాగు చేసిన పత్తి పంట

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరిక పత్తి రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. పత్తి పంట చేతికొచ్చిన సమయంలో వర్ష సూచన అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా పత్తి సాగుపై రైతులు గత కొన్నేళ్లుగా అమితాసక్తిని చూపుతున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో రెండు లక్షలా ఒక వెయ్యి హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. ఇందుకు గాను రైతన్నలు లక్షలాది రుపాయల పెట్టుబడి పెట్టారు. రైతులు సాగు చేసిన పత్తిపంట ప్రస్తుతం చేతికొస్తోంది. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కొంతమంది రైతులు పత్తిని తీసి విక్రయాలు చేస్తున్నారు. మరికొంతమంది పత్తిని తీస్తున్నారు. ఈ తరుణంలో వర్షాలు వస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలపడంతో రైతన్నల గుండెల్లో గుబులు రేగింది. వర్షాలు కురిస్తే పత్తికాయలు ముగిరిపోవడమేగాక, చేతికొచ్చిన పత్తి సైతం నాణ్యత తగ్గి, రంగు మారుతుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. దీంతో ఈ ఏడాది కూడా అతివృష్టి వల్ల తాము నష్టాల పాలవుతామోనన్న అనుమానాన్ని రైతన్నలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమయంలో వర్షాలు వస్తే నష్టమే



ఈ సమయంలో వర్షాలు పడితే పత్తికాయలు ముగిరిపోతాయి. పత్తి రంగు మారుతుంది. దీంతో మార్కెట్‌లో ధర రాక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరా పత్తిపంట సాగు చేసేందుకు దాదాపు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తుంది. పంటచేతికొచ్చే సమయంలో వర్షం కురిస్తే పెట్టిన పెట్టుబడి కూడా రాదు. - నాగయ్య, రైతు, కొటేకల్లు

మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర



పెరిగిన తుంగభద్ర నీటి మట్టం

మంత్రాలయం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. సోమవారం సాయంత్రం 7 గంటలకు మంత్రాలయం వద్ద 91,720 క్యూసెక్కులతో 310.650 మీటర్ల నీటి మట్టంతో రెండు రాష్ట్రాల సరిహద్దులను తాకుతూ ప్రవాహం ఊపందుకుంది. దీంతో మంత్రాలయం తహసీల్దార్ రవి తుంగభద్ర నదితీరాన్ని పరిశీలించారు.

వరద ఉధృతిని అంచనా వేసి భక్తులు, నదీతీర గ్రామాల రైతులను అప్రమత్తం చేశారు. శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్‌లు పుణ్య స్నానాలకు వెళ్లే భక్తులకు మైకుల ద్వారా

మైకుల ద్వారా హెచ్చరికలు

హెచ్చరికలు చేశారు. ముందు జాగ్రత్తలో భాగంగా నది ఒడ్డున పుట్టీలు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

ప్రస్తుతం హోస్పేట్ టీబీ డ్యాంలో 1631.95 మీటర్ల నీటి మట్టం ఉంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 50,290 క్యూసెక్కులు రాగా, తుంగభద్ర నదికి 31,642 క్యూసెక్కులకు తగ్గించారు. మంత్రాలయం వద్ద గంగమ్మ దేవాలయం వరద తాకుతూ ప్రవహిస్తుండటంతో నదితీర గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్‌ఏలతో దండోరా వేయించి పశువుల కాపర్లు, చేపల వేటకు వెళ్లే వారికి, నదితీర విద్యుత్ మోటార్ల రైతులను నదిలోకి వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు.

మోటార్ సైకిళ్లను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

అవుకు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణం సాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు సోమవారం తీవ్రంగా గాయపడ్డారు. అవుకు పట్టణానికి చెందిన రాఘవ, విశ్వనాథ్‌లు జాలర్లు. రిజర్వాయర్‌లో చేపల వేట ముగించుకొని మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా సాయిబాబా ఆలయం సమీపంలోకి వచ్చే సరికి బనగానపల్లెకు చెందిన ప్రైవేట్ బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. అలాగే మరో మోటర్ సైకిల్‌పై నబీరసూల్, హుశేన్‌బాషా అవుకుకు వస్తుండగా పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చే సరికి అదే ప్రవేట్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. నబీరసూల్ అనే యువకుడు గాయపడ్డాడు. 108 వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని నబీరసూల్‌ను బనగాపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడ్డ రాఘవ, విశ్వనాథ్‌ను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైకు, లారీ ఢీ.. వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లారీని బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి సౌదరదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. బనగానపల్లె మండలం ఇల్లూరు, కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా (27) అనే వ్యక్తి బైకుపై కోవెలకుంట్లకు వస్తూ సౌదరదిన్నె బస్టాండు దగ్గర ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కొడుకు ఉన్నారు. మృతుని తండ్రి అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

కోసిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామ సమీపంలో ఉరుకుందకు వెళ్లే భక్తుల ఆటో బోల్తా పడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. దుద్ది గ్రామానికి చెందిన చంద్రమ్మ, లక్ష్మి, చిన్న ఉలిగయ్య, పార్వతి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉరుకుంద దేవస్థానానికి ఆటోలో బయలుదేరారు. గౌడుగల్లు సమీపంలోని రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తా పడడంతో చంద్రమ్మ, లక్ష్మి, ఉలిగయ్య, పార్వతిలకు తీవ్ర గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

అవుకు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన వడ్డె సాంబశివుడు (46), చాకలి సుబ్బమ్మ (77) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వడ్డె సాంబశివుడు కడుపునొప్పి తాళలేక ఇంటి వద్దనే క్రిమిసంహారిక మందును తాగాడు. అలాగే చాకలి సుబ్బమ్మ వయోభారంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి వద్దనే క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఇరువురిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారులు



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

- ఆటో డ్రైవర్ల సాయంతో గుర్తించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను ఆటో డ్రైవర్ల సాయంతో వెతికి పట్టుకుని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించి అందరి ప్రశంసలు అందుకున్నారు త్రీటౌన్ పోలీసులు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మారుతి మెగాసిటీలో శ్రీనిధి అపార్టుమెంటుకు చెందిన అభినవరెడ్డి (6), హరిచరణ్ (5) అనే ఇద్దరు చిన్నారులు సోమవారం ఉదయం రూ.10 నోటు తీసుకుని జామకాయలు కొనేందుకు బయటకు వచ్చారు. తిరిగి ఎంత సేపటికీ ఇంటికి రాలేదు. దీంతో వీరి తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు.

డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్‌ఐ మన్మథ విజయ్ రెండు బృందాలుగా ఏర్పడి పిల్లల ఆచూకీ కోసం ఆరా తీశారు. పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు వాట్సాప్ గ్రూపులతో పాటు ఆటో డ్రైవర్ల వాట్సాప్ గ్రూపుల్లో చేరవేశారు. సీ.క్యాంపు చెందిన కొంతమంది మహిళలు ఈ చిన్నారులను గుర్తుపట్టి మాంటిస్సోరి స్కూల్ ఆటో డ్రైవర్లకు విషయాన్ని తెలిపారు. దీంతో ఆటో డ్రైవర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఆటో డ్రైవర్లు కలిసి కర్నూలు అరోరానగర్ జమ్మిచెట్టు వద్ద ఆ ఇద్దరు పిల్లలను గుర్తించారు. వారిని చేరదీసి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. మూడు గంటల్లో కేసు ఛేదించినందుకు ఎస్పీ బిందుమాధవ్ త్రీటౌన్ పోలీసులను అభినందించారు. పోలీసులకు సహకరించిన ఆటో డ్రైవర్లు ఉపేంద్ర నాయక్, బాలరాజులను త్రీటౌన్ పోలీసులు సన్మానించి అభినందించారు.

పెళ్లికి నిరాకరించిందని ఆత్మహత్య

కర్నూలు(క్రైం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెళ్లికి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కర్నూలు పట్టణంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకున్నది. సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం యాల్లూరు చెందిన పార్థుడు(32) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

వీరి దూరపు బంధువు రేణుకా అనే మహిళ భర్త చనిపోవడంతో కల్లూరులో మారుతి నగర్‌లో నివాసం ఉంటుంది. ఆ మహిళను పెళ్లి చేసుకోవాలని పార్థుడు ప్రయత్నం చేశాడు. అయితే.. ఆ మహిళ నిరాకరించడంతో మనస్తాపానికి గురైన అతడు సోమవారం తెల్లవారుజామున సదరు మహిళ ఇంటి ముందు శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటి చుకున్నాడు. స్థానికులు గుర్తించి హుటా హుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఆర్ ఈఈగా రఘురామిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):



పంచాయతీరాజ్ శాఖ పీఐయూ విభాగం కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.రఘురామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ ఆవరణలోని కార్యాల యంలో ఆయనకు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆయన 1992లో సర్వీసు కమిషన్ ద్వారా ఏఈగా ఉద్యోగంలో చేరారు. 2004లో డీఈగా పదోన్నతి పొం దారు. 2023లో ఈఈగా పదోన్నతి పొంది కర్నూలు సర్వశిక్ష అభియాన్‌కు వచ్చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కర్నూలు పీఐయూ డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఎస్పీ అందుకున్న ఫిర్యాదుల్లో కొన్ని..

- నేను బీటెక్ పూర్తి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. తెలిసిన వ్యక్తి ద్వారా హైదరాబాదులో ఉన్న హరిప్రసాద్ రెడ్డి ఐటీసాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.2.30లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం, బేతపల్లి గ్రామానికి చెందిన శివకేశవరెడ్డి ఫిర్యాదు చేశారు.
- నా కుమారుడు, నా కోడలు ఆస్తులు రాసి ఇవ్వాలంటూ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని కర్నూలు పాతబస్తీకి చెందిన జే.సరస్వతి ఫిర్యాదు చేశారు.
- నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు తీసుకుని మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వి.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- నన్ను కొట్టి, నా ఇంట్లోకి రానివ్వకుండా ఆస్తిని ఆక్రమించుకోవాలని మా బంధువులు బెదిరిస్తున్నారని, నాకు రావాల్సిన ఇంటి కిరాయి డబ్బులు కూడా రానివ్వకుండా చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఆదోనికి చెందిన సంగీతబాయి ఫిర్యాదు చేశారు.
- నా దగ్గర నుంచి 59 క్వింటాళ్ల శనగలు ఉయ్యాలవాడకు చెందిన నాగేశ్వరరెడ్డి కొనుగోలు చేసి తీసుకున్నాడు. డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెకు చెందిన మహాదేవుడు ఫిర్యాదు చేశారు.

వైభవంగా రథోత్సవం

శ్రీశైలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరిం చుకొని లోకకల్యాణార్థం భ్రమరాంబ మల్లి కార్జున స్వామివార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలం కరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు జరిపారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వ హించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులను జేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తున్న అర్చకులు

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ డీఎస్సీ రాయనున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ త్మకూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బట్టు అంకన్న అన్నారు. అర్హత గల అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 27న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించి ఆ తర్వాత శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

మహానందిలో ఉద్యాన విద్యాలయం వీసీ పూజలు

మహానంది, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మహానంది క్షేత్రంలో వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గోపాల్ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో వైస్ ఛాన్సలర్ గోపాల్ దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. అనంతరం వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. ఏఈవో సన్మానించారు. వీరివెంట మహానంది ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఠాగూర్ నాయక్ పాల్గొన్నారు.


వీసీ గోపాల్‌ను సన్మానిస్తున్న ఏఈవో

సమస్యలు పరిష్కరించాలి

పాణ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు మళ్లీ రాకుండా వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. కుందూ నదీ తీరంలో పర్యవేక్షణ లేక కుందూ తీర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తొగర్చేడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. అలాగే జాబ్‌కార్డులు మూడేళ్లుగా మంజూరు కాలేదన్నారు. దీనిపై తహసీల్దారు మాట్లాడుతూ త్వరలో సాగునీటి సంఘాల కమిటీల ద్వారా కుందూ పర్యవేక్షణ జరుగుతుందన్నారు. తమ్మరాజుపల్లెలో ఉపాధి పథకం ద్వారా పంట కాలువల పనులు చేపట్టాలని ఎంపీటీసీ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలో ఉపాధి పనులు 71 గుర్తించామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు

విత్తన శుద్ధితో రైతులకు మేలు

నంద్యాల రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : విత్తనశుద్ధితో పాటు నా ణ్యత ప్రమాణాలు పాటిస్తేనే రైతులకు మేలు జరుగుతుందని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణ సమీపంలో ని బాలాజీ సీడ్స్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఏవో ప్రసాదరావ్ తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరానికి గాను ప్రభుత్వం ద్వారా సబ్సీడిపై సరఫరా చేసే శనగ విత్తనాలను సరఫరా చేసేటప్పుడు రైతుల వివరాలతో కూడిన రిజిస్ట్రర్‌ను, ప్రాసెసింగ్ చేసే విధానాలను పరిశీలించామన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, విత్తనశుద్ధి చేసిన తర్వాత రైతుసేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. నాణ్యతలో ఏమైనా లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.


శనగ విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ రాజశేఖర్

యువత క్రీడలపై మక్కువ చూపాలి

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై మక్కువ చూపాలని ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం లో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన క్రీడా జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైల్వేస్ వాలీబాల్ క్రీడాకారులు నిమ్మి కృష్ణయాదవ్, స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు పస్పిల్ మున్నా, జునీద్‌బాషా, రేడియం నూర్ తదితరులున్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐలు

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

నంద్యాల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల ఏపీఎస్ ఆర్టీసీ డిపోకు మంజూరైన మూడు నూతన బస్సులను మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నంద్యాలకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీపీడీవో రజియా సుల్తానా, ఆర్టీసీ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి బలోపేత కార్యక్రమాలు: మంత్రి

నంద్యాల రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పల్లెలలో ఏమాత్రం ప్రగతిలేక నీరసించి ఉన్నాయని, పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల మండలం చాపిరేవులలో రూ.28 లక్షలతో, కానాలలో రూ.25 లక్షలతో సీసీ రహదారుల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో చాపిరేవుల సర్పంచ్ దొమ్మరి నంద్యాల రాజు, భూపాల్‌రెడ్డి, గురున్నాదరెడ్డి, బాలస్వామిరెడ్డి, బాబు పాల్గొన్నారు.

పాణ్యం: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో రూ. 2.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జ మీవుల్లా తెలిపారు. సోమవారం స్థానిక బీసీ కాలనీ, లో రూ. 10 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. అయా చోట్ల ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి పనులు ప్రారంభించారు. ఈవోఆర్‌డీ చంద్రమౌళీశ్వర గౌడ్, ఏపీవో విజయ రాణి, పీఆర్ఏఈ మహబూబ్‌బాష, కార్యదర్శి ఆనందరావు, ఎంపీటీసీ రంగరమేష్, టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి, నాయకులు సుబాన్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని తేళ్లపురిలో సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, రాయపాడు, ఎస్ కూలూరులో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో అమానుల్లా, ఈవోఆర్‌డీ నాగఅనసూయ, ఏపీవో జ్యోతి, భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీశ్వరరెడ్డి, ఏఈ పుల్లయ్య, రామకృష్ణారెడ్డి, బుడ్డారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మద్యం టెండర్లలో విజేతలు వీరే..

నందికొట్కూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎంతో ఉత్కంఠంగా ఎదురు చూస్తున్న ప్రైవేట్ మద్యం టెండర్లలో 10 మంది టెండర్లను దక్కించుకొని విజేతలుగా నిలిచారు. నందికొట్కూరు పట్టణంలోని 25వ దుకాణం నందికొట్కూరుకు చెందిన బియ్యం జనార్ధన్ నాయుడు, 26వ దుకాణం ఖమ్మం జిల్లాకు చెందిన కొండపల్లి గణేష్, 27వ షాపును శ్రీరామథియేటర్ యజమాని రామిరెడ్డి, 28వ షాపును పోతులపాడుకు చెందిన రవికాంత్, నందికొట్కూరు రూరల్‌కు సంబంధించిన 29వ షాపును పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన కట్టుబడి శ్రీనివాసులు, 30వ షాపును మిడ్తూరు మండలం జలకనూరుకు చెందిన రాజేష్ కుమార్‌రెడ్డి, జూపాడుబంగ్లా మండలానికి చెందిన 31 షాపును తరిగోపులకు చెందిన దూదేకుల ముర్తుజావలి, మిడ్తూరు మండలంలోని 32వ,33వ దుఖాణాలను అల్లంపూర్ గద్వాల జిల్లాకు చెందిన చెందిన రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలు దక్కించుకున్నారు. పగిడ్యాల 34వ షాపును గుండ్రటి రవీంద్రనాథ్‌రెడ్డిలు దక్కించుకున్నారు. మద్యం దుఖాణాలను దక్కించుకున్న వారిలో 3 మినహా మిగిలిన వారంతా నియోజకవర్గానికి చెందినవారే.

గడువు సరే ఇసుక ఎక్కడ?

- మార్చి లోపల నిర్మాణాలు పూర్తి కాకపోతే బిల్లులు రావని అధికారుల హుకుం
- గృహ లబ్ధిదారుల ఆందోళన

పాణ్యం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీలకు ఇసుక శాపంగా మారింది. మార్చిలోపు నిర్మాణాలు పూర్తి కాకపోతే నిధులు రావని అధికారులు హుకుం జారీ చేయడంతో ఇసుక లేక గృహ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పాణ్యం మండలంలోని 19 గ్రామాల్లోని 11గ్రామాలలోని 601 జగనన్న లేఅవుట్లు వేయగా 728 సొంత స్థలాలకు ఇల్లు మంజూరు చేశారు. వీటిలో 740 గృహాలు పూర్తికాగా 589 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో నిలిచిపోయాయి. పాణ్యంలోని మేకలబండలో ఇచ్చిన 448 స్థలాలలో 97 ఇళ్లు పూర్తి కాగా, మిగిలిన 351 గృహాలు ఇసుకలేక నిలిచిపోయాయి. ఇళ్ల నిర్మాణం చేపట్టిన ఆరు నెలల్లో 30 ఇళ్లు పూర్తి కాగా మూడేళ్లలో ఒక్క ఇల్లు పూర్తి కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కాలనీలు గ్రామాలకు దూరంగా ఉండడంతో పాటు రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాణ్యంలోని జగనన్న కాలనీలో దాదాపు 30మంది ఇళ్లల్లో జీవనం సాగిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. అటు నిర్మాణం పూర్తి చేసుకోలేక, అప్పులు పెరిగి మానసికంగా ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇసుక పాణ్యంలోని మార్కెట్ యార్డులో నిల్వ ఉంచి లబ్ధిదారులకు అందించేవారు. ప్రస్తుతం ఇసుక లేకపోవడంతో ఇల్లు నిలిచిపోయాయి. మూడేళ్లుగా ఇసుక లేక నిర్మాణాలు పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు.


శ్లాబ్ నిర్మాణానికి ఇసుక లేక నిలిచిన ఇల్లు


సగంలోనే నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

శ్లాబు నిలిచిపోయింది



ఇంటిపైకప్పుకు వేయాల్సిన శ్లాబు మూడు నెలలుగా నిలిచి పోయింది. దీంతో సెంట్రింగ్ సామానుకు బాడుగ పెరిగి తడిసి మోపెడయింది. ఇసుక లేక శ్లాబు నిలిచిపోవడంతో బాడుగ ఇళ్లల్లోనే ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరా చేసి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించాలి.

- విజయలక్ష్మి, పాణ్యం

బస్తా ఇసుక రూ. 50



ఇసుక లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఇసుక బస్తా రూ. 50లు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇసుక కొనుగోలు చేసినా రవాణాకు ఆటో బాడుగ రూ. 300లు వెచ్చించాల్సి వస్తోంది. నంద్యాల నుంచి పాణ్యంకు ఇసుక రవాణా చేయాలంటే ట్రాక్టరు ఇసుక రూ. ఏడు వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వమే వెంటనే ఇసుక పంపిణీ చేపట్టాలి.

- బైరక్‌దారి ఖలీల్‌బాషా, పాణ్యం

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

నందికొట్కూరురూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని కోనేటమ్మ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనులు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దామోదరెడ్డి, టీడీపీ పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, ఏపీవో అలివేలుమంగమ్మ, పీఏస్ తరుణ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జయసూర్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూపాడు బంగ్లా మండలానికి రూ.2.50కోట్లు మంజూరు కాగా, తాటిపాడు గ్రామానికి రూ. 30 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, వీరారెడ్డి, గోరేసా హెబ్, మాజీసర్పంచ్ లక్ష్మీన్న గౌడు వెంకటేశ్వ ర్లు యాదవ్, రమణారెడ్డి, బాల మద్దిలేటి, మద్దూరు సుధాకర్, జం గాలపెద్దన్న, దేవ సహాయం, భాస్కరరెడ్డి, ఖాజీ కురైషన్, మన్సూర్ బాషా, ఉసేనయ్య, జనసేన నాయకులు రవికుమార్, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.


కోనేటమ్మపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పేదల ఆత్మగౌరవం అన్న క్యాంటిన్

నందికొట్కూరు: అన్న క్యాంటిన్లు రాష్ట్రంలోని పేద ప్రజల ఆత్మగౌరవమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని మార్కెట్ ఆవరణలో అన్న క్యాంటిన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కడుపునిండా తిని నచ్చిన పనులు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పునఃప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, భాస్కర్‌రెడ్డి, చిన్నరాజు, మందాడి వాణి, సుమలత, టీడీపీ నాయకులు లాయర్ జాకీర్, ముర్తుజావళి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, సురేంద్ర, వేణుగో పాల్, డా.వనజ, మీనాక్షి, బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకుడు నలమల రవికుమార్ పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

నందికొట్కూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోదారులపై ఇంధన సర్దుబాటు ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈనెల 18న విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచిందని బాదుడేబాదుడు పేరుతో ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ విమర్శించిందన్నారు. వైసీపీ తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా ట్రూ అప్ సర్దుబాటు పేరుతో రూ.20 కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ధర్నాలో విద్యుత్ వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రూ. 17 కోట్లతో అభివృద్ధి పనులు

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


గోపవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మహానంది, అక్టోబరు 14: (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీశైలం నియోజకవర్గానికి రూ. 17 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మహానంది మండలంలోని గాజులపల్లి, గోపవరం, తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల్లో రూ. కోటి 50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదార్ల నిర్మాణానికి భూమి పూజను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరాల మౌళీశ్వరరెడ్డి, క్రాంతికుమార్‌యాదవ్, కలర్స్ రవినాథరావు, కంచెర్ల శివ, మహేశ్వరరెడ్డి, శ్యామల జనార్దన్ రెడ్డి, సీహెచ్ రాముడు, పాణ్యం ప్రసాదరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 14: దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన సాంప్రదాయ దసరా వేషాల పోటీల విజేతలకు సోమవారం రామక్రిష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కళారాధన ప్రధాన కార్యదర్శి డా.రవిక్రిష్ణ , రామక్రిష్ణా డిగ్రీకళాశాల చైర్మన్ డా. రామక్రిష్ణారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరక్టర్ తులసిరెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు గ్రహీతలు డాక్టర్ రవిక్రిష్ణ, శివరామిరెడ్డి, రామసుబ్బయ్య వ్యవహరించారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

శ్రీశైలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామంజినాయక్ సూచించారు. సోమ వారం శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లు, వాహనాల యజమానులకు స్థానిక కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎస్‌బీఎంఎస్ ఈవో పెద్దిరాజు, శ్రీశైలం సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన మహేష్ అనే యువకుడు మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం నుంచి శ్రీశైలానికి వస్తున్న టూరిస్ట్ వ్యాన్ అతడిని ఢీకొనడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా అతని పక్కనే ఉన్న రబ్బాని అనే వృద్ధుడికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్సలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కాగా సమాచారం తెలుసుకున్న ఎస్సై వెంకటనారాయణరెడ్డి గాయపడిన వారిని పరామర్శి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

బాధిత కుటుంబానికి రూ.1.10 లక్షల సాయం

నంద్యాల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసానికి గురై బలవన్మరణానికి పాల్పడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నంద్యాలకు చెందిన ఖలీల్ అహమ్మద్ కుటుంబానికి రూ.1.10లక్షల ఆర్థిక సహాయాన్ని ఆల్‌మేవ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సయ్యద్ ఇమ్రాన్‌పాషా, మహమ్మద్ సలీంలు సోమవారం అందజేశారు. ఆల్‌మేవ సభ్యులు రూ.78,400, రూటా సభ్యులు రూ.15,100, భవిత కోచింగ్ రూ.5వేలు, ఇతర స్నేహితులు తదితరులు సేకరించిన మొత్తం నగదు రూ.1.10లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సామాన్యులే కాకుండా మేధావులు, ప్రభుత్వ ఉద్యోగులు సైబర్ వలలో పడి రూ.లక్షల్లో నష్టపోవడం, ప్రాణాలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అనుమానం ఉన్న వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు.

మహిళ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు

పాణ్యం,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సార్బీసీ కెనాల్‌లో పడి కొట్టుకుపోయిన వెన్నెల కోసం పోలీసులు, రెవెన్యూ అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈనెల 13న గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన మహిళ వెన్నెల కుటుంబ సభ్యులతో పాటు స్నానానికై కెనాల్‌లో దిగి అదుపు తప్పి పడిపోవడంతో కనపడలే దని ఎస్సై నరేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కొనిదేడు, ఆల మూరు, బనగాన పల్లె మండలంలోని రామతీర్థం వరకు కెనాల్ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. వెన్నెల ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త జార్జి, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

మహానంది, అక్టోబరు 14: (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ వద్ద ప్రవహిస్తున్న తెలుగుగంగ ప్రధాన కాల్వలో ప్రమాదవశాత్తు పడి కొట్టుకొని పోయిన యువకుడి గౌతమ్(17) మృతదేహం సోమవారం లభించినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని 14వ బ్లాక్ కాల్వలో కొట్టుకొనిపోతున్న యువకుడి మృతదేహన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమి చ్చారు. బయటకు తీసి గౌతమ్ మృతదేహంగా గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

మిడుతూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మిడు తూరు తహసీల్దార్ కార్యాలయం దగ్గర ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్న ట్లు ఎంపీడీవో దశరథరామయ్య తెలిపా రు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని ఎంపీడీవో తెలిపారు.

సందడిగా సాగిన వసంతోత్సవం

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యో తి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వసంతోత్సవ క్రతువు సందడిగా సాగింది. విజయదశమి మరుసటి రోజు శ్రీకన్యకాపరమేశ్వరీ అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ మరుసటి రోజున వసంతోత్సవంతో రంగులు చల్లుకుంటూ పండుగ విజయవంతమైందని ఆనందంగా సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భీమిశెట్టి కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఏపీవోగా హరికృష్ణ

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల ఉపాధి అధికారిగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బనగానపల్లె ఏపీవోగా విధులు నిర్వహిస్తూ డి ప్యూటేషన్‌పై కొత్తపల్లి మండలానికి వచ్చారు. ఇక్కడ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న రేష్మా సాధారణ బదిలీల్లో భాగంగా బనగానపల్లెకి బదిలీపై వెళ్లారు.

నాణ్యత తక్కువ.. ధర ఎక్కువ..

శనగ విత్తనాల సేకరణలో గోల్‌మాల్




5వ పేజీ తరువాయి

ప్రస్తుత ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాకు 45,955 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 26 వేల క్వింటాళ్లు మొత్తం 71,955 క్వింటాళ్ల శనగ విత్తనాలను 20 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నందికొట్కూరు, కడపతోపాటు నంద్యాల ప్రాంతంలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు ఈ విత్తనాలను సప్లయ్ చేసేందుకు ఏపీ సీడ్స్ సంస్థ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి శనగ విత్తనాల ధరను పెద్ద ఎత్తున పెంచుకునేందుకు చేసిన ప్రయత్నాలకు కొంతమంది ముఖ్యమైన నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. వాస్తవంగా రైతులు చెబుతున్న వివరాల మేరకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం శనగ విత్తనాల ధర రూ.7 వేలు మాత్రమే ఉంది. అటువంటి సమయంలో వ్యాపారులకు క్వింటానికి రూ.9 వేలు చెల్లించి నాసిరకం విత్తనాలను రైతులకు అందించాల్సిన అవసరం ఏమిటని..? ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలకు వ్యాపారులు గుడ్‌విల్ చెల్లించినట్లు అర్థమవుతోందని రైతు సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. క్వింటం శనగ విత్తనాలపై వ్యాపారులకు ప్రభుత్వం నిర్ణయించిన 9వేలను పరిగణనలోకి తీసుకుంటే ఖర్చులు పోను రూ.1,500లు మిగులుబాటు అవుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా మొత్తం మీద రూ.71,955 క్వింటాళ్లపై క్వింటానికి రూ.1,500 మిగులుబాటును లెక్కేస్తే రూ.17.79 కోట్లు వ్యాపారుల చేతికి దక్కుతోంది. ఈ మొత్తంలో 10 నుంచి 20 శాతం అధికారులకు, రాజకీయ నాయకులకు చెల్లించినా దాదాపు రూ.6 కోట్లకు పైగానే వ్యాపారుల జేబుల్లో పడినట్లే.

పెద్ద మొత్తంలో ధర చెల్లించినా నాణ్యమైన పప్పు శనగ విత్తనాలు కాకుండా మార్కెట్ యార్డులో తక్కువ ధరకే అంటే క్వింటానికి రూ.6,7 వేలకు కొనుగోలు చేసి రూ.9 వేలకు బేరాలు కుదుర్చుకుని ఏపీ సీడ్స్ సంస్థకు తగలగడుతున్న వ్యాపారులు కనీసం నాణ్యతతో కూడిన విత్తనాలనైనా సప్లయ్ చేయకపోవడంతో రైతుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పరి మండల కేంద్రంలో 250 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు నాసిరకం అని తేలడంతో బుధవారం

విత్తన నాణ్యత లేక తిప్పి పంపుతున్న అధికారులు



స్థానిక వ్యవసాయ అధికారులు వాటిని ఏపీ సీడ్స్ సంస్థకు వెనక్కు లారీ ద్వారా పంపించేశారు. అదేవిధంగా నందికొట్కూరులో సుభాని ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏ మాత్రం క్లీనింగ్ చేయని విత్తనాలు సప్లయ్ చేసినట్లు తేలింది. దీంతో కర్నూలు ఏడీఏ శాలురెడ్డి ఇంకోసారి నాణ్యత లేని విత్తనాలు తమకు సప్లయ్ చేయవద్దని ఏపీ సీడ్స్ సంస్థ అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు అందజేసే విత్తనాలు చెత్తాచెదారం రెండు శాతమే ఉండాలని 10.10 ఎంఎం సైజులో విత్తనాలు ఉండాలని, అదే విధంగా 85 శాతం(మొకల శాతం) జనరేషన్ ఉండాలని ఏడీఏ స్పష్టం చేశారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయండి



బయటి మార్కెట్‌లో క్వింటం శనగ విత్తనాల ధర రూ.7వేల లోపు ఉంది. అయితే ఏపీ సీడ్స్ సంస్థ రూ.9 వేలు చెల్లించి వ్యాపారుల నుంచి నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయడం దారుణం. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రాయితీపై అందించే వేరుశనగ, పప్పుశనగ విత్తనాల సప్లయ్‌లో వ్యాపారులు పెద్ద ఎత్తున లాభపడుతుంటే.. రైతులు మాత్రం దిగుబడి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నాణ్యమైన విత్తనాలనే అందిస్తాం



రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యత కలిగిన విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రాంతాల్లో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవం. ఆస్పరిలో నాసిరకం విత్తనాలని తేల్చి మా అధికారులు వెనక్కు పంపారు. ఈ వ్యవహారంపై ఏపీ సీడ్స్ సంస్థ అధికారులకు వివరణ ఇవ్వాలని లెటర్ రాశాం. నందికొట్కూరుతోపాటు కడప జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు శనగ విత్తనాలను ఏపీ సీడ్స్ సంస్థ అందిస్తోంది. నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. - వరలక్ష్మి, జేడీ, కర్నూలు.

పత్తి రైతు గుండెల్లో గుబులు

మళ్లీ మూడు రోజులపాటు వర్షాలు



ఎమ్మిగనూరు మండలంలో సాగు చేసిన పత్తి పంట

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరిక పత్తి రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. పత్తి పంట చేతికొచ్చిన సమయంలో వర్ష సూచన అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా పత్తి సాగుపై రైతులు గత కొన్నేళ్లుగా అమితాసక్తిని చూపుతున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో రెండు లక్షలా ఒక వెయ్యి హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. ఇందుకు గాను రైతన్నలు లక్షలాది రుపాయల పెట్టుబడి పెట్టారు. రైతులు సాగు చేసిన పత్తిపంట ప్రస్తుతం చేతికొస్తోంది. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కొంతమంది రైతులు పత్తిని తీసి విక్రయాలు చేస్తున్నారు. మరికొంతమంది పత్తిని తీస్తున్నారు. ఈ తరుణంలో వర్షాలు వస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలపడంతో రైతన్నల గుండెల్లో గుబులు రేగింది. వర్షాలు కురిస్తే పత్తికాయలు మురిగిపోవడమేగాక, చేతికొచ్చిన పత్తి సైతం నాణ్యత తగ్గి, రంగు మారుతుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. దీంతో ఈ ఏడాది కూడా అతివృష్టి వల్ల తాము నష్టాల పాలవుతామోనన్న అనుమానాన్ని రైతన్నలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమయంలో వర్షాలు వస్తే నష్టమే



ఈ సమయంలో వర్షాలు పడితే పత్తికాయలు మురిగిపోతాయి. పత్తి రంగు మారుతుంది. దీంతో మార్కెట్‌లో ధర రాక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరా పత్తిపంట సాగు చేసేందుకు దాదాపు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తుంది. పంటచేతికొచ్చే సమయంలో వర్షం కురిస్తే పెట్టిన పెట్టుబడి కూడా రాదు. - నాగయ్య, రైతు, కొటేకల్లు

మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర



పెరిగిన తుంగభద్ర నీటి మట్టం

మంత్రాలయం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. సోమవారం సాయంత్రం 7 గంటలకు మంత్రాలయం వద్ద 91,720 క్యూసెక్కులతో 310.650 మీటర్ల నీటి మట్టంతో రెండు రాష్ట్రాల సరిహద్దులను తాకుతూ ప్రవాహం ఊపందుకుంది. దీంతో మంత్రాలయం తహసీల్దార్ రవి తుంగభద్ర నదీతీరాన్ని పరిశీలించారు.

వరద ఉధృతిని అంచనా వేసి భక్తులు, నదీతీర గ్రామాల రైతులను అప్రమత్తం చేశారు. శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్‌లు పుణ్య స్నానాలకు వెళ్లే భక్తులకు మైకుల ద్వారా

మైకుల ద్వారా హెచ్చరికలు

హెచ్చరికలు చేశారు. ముందు జాగ్రత్తలో భాగంగా నది ఒడ్డున పుట్టీలు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

ప్రస్తుతం హోస్పేట్ టీబీ డ్యాంలో 1631.95 మీటర్ల నీటి మట్టం ఉంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 50,290 క్యూసెక్కులు రాగా, తుంగభద్ర నదికి 31,642 క్యూసెక్కులకు తగ్గించారు. మంత్రాలయం వద్ద గంగమ్మ దేవాలయం వరద తాకుతూ ప్రవహిస్తుండటంతో నదీతీర గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలతో దండోరా వేయించి పశువుల కాపర్లు, చేపల వేటకు వెళ్లే వారికి, నదీతీర విద్యుత్ మోటార్ల రైతులను నదిలోకి వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు.

ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

సి. బెళగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తప్పవని కర్నూలు మైనింగ్ అధికారులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, పోలకల్, తిమ్మనదొడ్డి, సంగాల, చింతమానుపల్లె గ్రామాల్లోని ఎర్రమట్టి కొండలను వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి స్పందించి మైనింగ్ అధికారులు ఎర్రమట్టి కొండలను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలించకుండా టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బైకు, లారీ ఢీ.. వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

లారీని బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి సౌదరదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. బనగానపల్లె మండలం ఇల్లూరు, కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా (27) అనే వ్యక్తి బైకుపై కోవెలకుంట్లకు వస్తూ సౌదరదిన్నె బస్టాండు దగ్గర ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కొడుకు ఉన్నారు. మృతుని తండ్రి అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు



చికిత్స చేస్తున్న వైద్యులు

కోసిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడ గల్లు గ్రామ సమీపంలో ఉరుకుందకు వెళ్లే భక్తుల ఆటో బోల్తా పడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. కోసిగి మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన చంద్రమ్మ, లక్ష్మి, చిన్న ఉలిగయ్య, పార్వతి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉరుకుంద దేవస్థానానికి ఆటోలో బయలుదేరారు. గౌడగల్లు సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తా పడి దుద్ది గ్రామానికి చెందిన చంద్రమ్మ, లక్ష్మి, ఉలిగయ్య, పార్వతిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారులు

- ఆటో డ్రైవర్ల సాయంతో గుర్తించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను ఆటో డ్రైవర్ల సాయంతో వెతికి పట్టుకుని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించి అందరి ప్రశంసలు అందుకున్నారు త్రీటౌన్ పోలీసులు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మారుతి మెగాసిటీలో శ్రీనిధి అపార్టుమెంటుకు చెందిన అభినవరెడ్డి (6), హరిచరణ్ (5) అనే ఇద్దరు చిన్నారులు సోమవారం ఉదయం రూ.10 నోటు తీసుకుని జామకాయలు కొనేందుకు బయటకు వచ్చారు. తిరిగి ఎంత సేపటికీ ఇంటికి రాలేదు. దీంతో వీరి తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు.

డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్ఐ మన్మథ విజయ్ రెండు బృందాలుగా ఏర్పడి పిల్లల ఆచూకీ కోసం ఆరా తీశారు. పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు వాట్సాప్ గ్రూపులతో పాటు ఆటో డ్రైవర్ల వాట్సాప్ గ్రూపుల్లో చేరవేశారు. సీ.క్యాంపు చెందిన కొంతమంది మహిళలు ఈ చిన్నారులను గుర్తుపట్టి మాంటిస్సోరి స్కూల్ ఆటో డ్రైవర్లకు విషయాన్ని తెలిపారు. దీంతో ఆటో డ్రైవర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఆటో డ్రైవర్లు కలిసి కర్నూలు అరోరానగర్ జమ్మిచెట్టు వద్ద ఆ ఇద్దరు పిల్లలను గుర్తించారు. వారిని చేరదీసి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. మూడు గంటల్లో కేసు ఛేదించినందుకు ఎస్పీ బిందుమాధవ్ త్రీటౌన్ పోలీసులను అభినందించారు. పోలీసులకు సహకరించిన ఆటో డ్రైవర్లు ఉపేంద్ర నాయక్, బాలరాజులను త్రీటౌన్ పోలీసులు సన్మానించి అభినందించారు.

పెళ్లికి నిరాకరించిందని ఆత్మహత్య

కర్నూలు(క్రైం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :

పెళ్లికి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కర్నూలు పట్టణంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకున్నది. సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం యాల్లూరు చెందిన పార్థుడు(32) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

వీరి దూరపు బంధువు రేణుకా అనే మహిళ భర్త చనిపోవడంతో కల్లూరులో మారుతి నగర్‌లో నివాసం ఉంటుంది. ఆ మహిళను పెళ్లి చేసుకోవాలని పార్థుడు ప్రయత్నం చేశాడు. అయితే.. ఆ మహిళ నిరాకరించడంతో మనస్తాపానికి గురైన అతడు సోమవారం తెల్లవారుజామున సదరు మహిళ ఇంటి ముందు శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటి చుకున్నాడు. స్థానికులు గుర్తించి హుటా హుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఆర్ ఈఈగా రఘురామిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):



పంచాయతీరాజ్ శాఖ పీఐయూ విభాగం కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.రఘురామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ ఆవరణలోని కార్యాల యంలో ఆయనకు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆయన 1992లో సర్వీసు కమిషన్ ద్వారా ఏఈగా ఉద్యోగంలో చేరారు. 2004లో డీఈగా పదోన్నతి పొం దారు. 2023లో ఈఈగా పదోన్నతి పొంది కర్నూలు సర్వశిక్ష అభియాన్‌కు వచ్చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కర్నూలు పీఐయూ డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఎస్పీ అందుకున్న ఫిర్యాదుల్లో కొన్ని..

- నేను బీటెక్ పూర్తి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. తెలిసిన వ్యక్తి ద్వారా హైదరాబాదులో ఉన్న హరిప్రసాద్ రెడ్డి ఐటీసాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.2.30లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం, బేతపల్లి గ్రామానికి చెందిన శివకేశవరెడ్డి ఫిర్యాదు చేశారు.
- నా కుమారుడు, నా కోడలు ఆస్తులు రాసి ఇవ్వాలంటూ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని కర్నూలు పాతబస్తీకి చెందిన జే.సరస్వతి ఫిర్యాదు చేశారు.
- నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు తీసుకుని మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వి.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- నన్ను కొట్టి, నా ఇంట్లోకి రానివ్వకుండా ఆస్తిని ఆక్రమించుకోవాలని మా బంధువులు బెదిరిస్తున్నారని, నాకు రావాల్సిన ఇంటి కిరాయి డబ్బులు కూడా రానివ్వకుండా చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఆదోనికి చెందిన సంగీతబాయి ఫిర్యాదు చేశారు.
- నా దగ్గర నుంచి 59 క్వింటాళ్ల శనగలు ఉయ్యాలవాడకు చెందిన నాగేశ్వరరెడ్డి కొనుగోలు చేసి తీసుకున్నాడు. డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెకు చెందిన మహాదేవుడు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి
డోన్
మంగళవారం 15 అక్టోబరు 2024

వైభవంగా పవిత్రోత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ఎగువ అహోబిలంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. పూజా కైంకర్యాల్లో జరిగిన తప్పులు, దోషాల నివారణతోపాటు లోక సుభిక్షం కోసం పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకం, నిత్యపూజ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కన్నులపండువగా గ్రామోత్సవం నిర్వహించారు.

16 నుంచి దిగువ అహోబిలంలో : దిగువ అహోబిలంలో ఈ నెల 16వ తేదీ నుంచి 21 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు మఠం నిర్వాహకులు సోమవారం తెలిపారు. యాగశాల ప్రవేశంతో పవిత్రోత్సవాలను ప్రారంభించి ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు నిత్యం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.



ఉత్సవమూర్తులు

వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

దొర్నిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం వాల్మీకి మహర్షి జయంతిని విజయవంతం చేయాలని మండల కార్యదర్శి బోయ బాల ఉసేని అన్నారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మాధవ్‌కు వినతి పత్రం అందజేశారు. బాల ఉసేని మాట్లాడుతూ వాల్మీకి జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీసు స్టేషన్‌లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో జరుపుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, 17న ప్రతి కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించాలని అన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

కొలిమిగుండ్ల: వాల్మీకి జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్, గుజ్జల పెద్దయ్య, సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం వాల్మీకి జయంతి ఉత్సవ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. సెలవు దినంగా ప్రకటించడంతో పాటు, ఎస్టీ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. కంబగిరిస్వామి, వెంకటరమణ, రామూర్తి పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

తడిసిన మొక్కజొన్న ధాన్యం

చాగలమర్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతం అల్పపీడన ప్రభావంతో చాగలమర్రిలో మోస్తారు వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది.

రుద్రవరం: మండలంలోని కోటకొండ, కొండమాయపల్లె, రుద్రవరం, ఆలమూరు, నరసాపురం, ముత్తలూరు రహదారుల్లో అకాల తుఫాను వర్షానికి మొక్కజొన్నలు తడిచాయని సోమవారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫానుతో మొక్కజొన్నలు తడిచిపోతున్నాయని పంట నేల వాలుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

బనగానపల్లె, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన కాంట్రాక్ట్ అధ్యాపకుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయ న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమస్యలు పట్టించుకోలేదన్నారు. కొత్తగా ఏర్పడిన కూట మి ప్రభుత్వానికి సమస్యలను పరిష్కరించాలని కోరామని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామయ్య, వీరన్న, మురళీమోహన్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

చాగలమర్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, ఎంపీడీవో మంజులవాణి సూచించారు. సోమవారం చింతలచెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం వేదమణి పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

బనగానపల్లె, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవచ్చని నంద్యాల సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రాముడు సోమవారం తెలిపారు. బనగానపల్లెలో ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు డీఎస్సీ పరీక్ష కొరకు ఉచిత బోధన, ఉచిత భోజన వసతివసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక

చాగలమర్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ పోటీలలో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ సోమవారం తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. అండర్-17 కబడ్డీ పోటీల్లో సమీర, నాహిద, ఫరీద్‌బాష, అండర్-14లో చిన్న, బ్యాడ్మింటన్‌లో సోహెల్, వాలిబాల్‌లో శశికిరణ్, షాహిద్, హరినరసింహ, ఖోఖోలో మహమ్మద్‌సాదిక్, మాబు, షరిఫ్, తిమోతి, యోగాలో సాజిద్, అఖిల్‌కుమార్‌లు ఎంపికైనట్లు పీడీ తెలిపారు.

లాటరీ పాయే.. సొమ్ము పాయే..!



- మద్యం దుకాణాల్లో పాల్గొన్న పలువురి పరిస్థితి ఇదీ..
- రూ.లక్షలు పోగొట్టుకుని గొల్లుమంటున్న పలువురు నాయకులు
- డోన్ నియోజకవర్గంలో వెల్లువెత్తిన దరఖాస్తులు



నంద్యాల డిప్ కార్యక్రమానికి హాజరైన దరఖాస్తు దారులు

డోన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): లాటరీ పోయింది.. లక్కు కలిసిరాలేదు.. ఉన్న సొమ్మూ పోయింది.. మద్యం దుకాణాల్లో పోటీ పాల్గొన్న చోటా నాయకుల పరిస్థితి ఇది. డోన్ నియోజకవర్గంలో రూ.లక్షలు పోగొట్టుకుని పలువురు లబోదిబోమంటున్నారు. డోన్ నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం దుకాణాలు ఉన్నాయి. డోన్ మున్సిపాలిటీలో నాలుగు, రూరల్‌లో 2, ప్యాపిలిలో 3, బేతంచెర్ల మున్సిపాలిటీలో 4, రూరల్‌లో 3 మద్యం దుకాణాలకు మొత్తం 385 దరఖాస్తులు వచ్చాయి. మద్యం సిండికేట్ యత్నాలు విఫలం కావడంతో నియోజకవర్గంలో ఇది ఆయా పార్టీల నాయకులు, పలువురు వ్యాపారులు పోటీ పడి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు చెల్లించి గ్రూపులుగా విడిపోయి దరఖాస్తులు చేశారు. దరఖాస్తుల రూపంలోనే డోన్ నియోజకవర్గంలోనే రూ.7.70 కోట్లు చెల్లించారు. దీన్నిబట్టి చూస్తే ఏ స్థాయిలో మద్యం దుకాణాలకు పోటీ పడ్డారో ఊహించవచ్చు.

● తరలివెళ్లిన ఆయ పార్టీల నాయకులు, వ్యాపారులు:

డోన్ నియోజకవర్గంలోని ఆయా పార్టీల నాయకులు, పలువురు వ్యాపారులు భారీ ఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలో మద్యం దుకాణాలకు ల్యాటరీ నిర్వహించడంతో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

● సొమ్ము పోగొట్టుకుని.. గొల్లుమంటున్నారు:

మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో సొమ్ము పోగొట్టుకుని పలువురు చోటా నాయకులు గొల్లుమంటున్నారు. డోన్ నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం దుకాణాలకు 385 దరఖాస్తులు వచ్చాయి. ఆయా పార్టీల నాయకులు, వ్యాపారులు భారీగా పోటీ పడి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ముఖ్యంగా అధికార పార్టీలోనే ఎక్కువగా గ్రూపులుగా ఏర్పడి మద్యం దుకాణాలను దక్కించుకునే ప్రయత్నాలు చేశారు. ఒక్కో నేత 5 నుంచి 10 దరఖాస్తుల వరకు సొమ్ము చెల్లించారు. అదే విధంగా కొందరు వైసీపీ నాయకులు, పలువురు వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు చేశారు. అయితే మద్యం దుకాణాల లాటరీలో ఇద్దరు, ముగ్గురు టీడీపీ నాయకులనే లక్కు వరించింది. దీంతో సదురు నేతలు ఖుషిఖుషిగా ఉన్నారు. టీడీపీకి చెందిన కొందరు నాయకులు రూ.50 లక్షల వరకు చెల్లించి దరఖాస్తులు చేసినా ఒక్క మద్యం దుకాణం కూడా దక్కకపోవడంతో గొల్లుమంటున్నారు. అదే విదంగా కొందరు వైసీపీ నాయకులు రూ.లక్షలు చెల్లించినా ఒక్క మద్యం షాపు కూడా దక్కకపోవడంతో లబోదిబోమంటున్నారు.

19 దుకాణాలకు 326 దరఖాస్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): ఆళ్లగడ్డ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలోని 19 మద్యం దుకాణాలకు 326 దరఖాస్తులు వచ్చాయి. నంద్యాల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన లక్కీడిప్‌లో విజేతలుగా నిలిచిన వారికి అధికారులు లైసెన్సులు జారీ చేశారు. టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలకు చెందిన పలువురు అనునాయిలకు మద్యం దుకాణాలు దక్కడంతో ఆయా మండలాల్లో ఎక్కడ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని చర్చించుకుంటున్నారు.

కోవెలకుంట్ల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని 11 మద్యంషాపుల కోసం ఈ నెల 3 నుంచి 11 వరకు సుమారు 144 మంది దరఖాస్తు చేసుకున్నారు.

లక్కీ డిప్ విజేతలు వీరే...

నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి ఎక్సైజ్ మద్యం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సోమవారం లక్కీ డిప్ తీశారు. వీరిలో 82వ షాపు రామేశ్వర్‌రెడ్డి 83వ షాపు కె.గణేశ్, 84వ షాపు బాబా ఫకృద్దీన్, 85వ షాపుకు ఎస్.వరలక్ష్మి, 86వ షాపుకు ఎ.రామనాథరెడ్డి, 87వ షాపుకు బీవీ భాస్కర్‌రెడ్డి (దొర్నిపాడు), 88వషాపుకు రాగి రమేశ్, 89వ షాపుకు బి.సురేంద్రనాథరెడ్డి, 90వ షాపుకు ఎ.మధునాగేంద్ర, 91వ షాపు సంతోష్‌కుమార్, 92వ షాపు సి.కొండయ్య ఉయ్యాలవాడ షాపులను దక్కించుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

లాటరీ లక్కు వీరిదే..

డోన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలో మద్యం దుకాణాల లాటరీ లక్కు వీరిని వరించింది. మొత్తం 16 మద్యం దుకాణాలను దక్కించుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	షాపు నెం.	దక్కించుకున్న వారి పేరు
డోన్ మున్సిపాలిటీ	66	నాగరాజు గౌడు
	67	వెంకటేశ్వరరెడ్డి
	68	ఆలా ప్రహ్లాదుడు
డోన్(రూరల్)	74	కైప రామేశ్వరరెడ్డి
	75	పి. శ్రీరాములు
బేతంచెర్ల మండలం	75	సృజల
	71	చంద్రశేఖర్ రెడ్డి
	72	కల్లూరి లోకేశ్
	73	శేషన్న
బేతంచెర్ల (రూరల్)	76	బ్రహ్మానందరెడ్డి
	77	కొండపల్లి గణేష్
	78	రామ మహేష్
ప్యాపిలి	79	బాస్కర్ నాయుడు
	80	జగదీశ్వర్ రెడ్డి
	81	కొంగనపల్లి మధు

అభివృద్ధి పనులకు భూమి పూజ

శిరివెళ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహదేవపురం, గుండంపాడు, బోయలకుంట్ల గ్రామాల్లో పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలను అధికారులు సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, మండల నోడల్ అధికారి జనార్ధనరావు, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వెలుగోడు మహేష్, రామనాగిరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మౌనిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో పల్లెపండుగ పంచాయితీ వారోత్సవాలు సోమవారం ఎంపీడీవో రమణ, టీడీపీ నాయకులు, ఆయా గ్రామ పంచాయితీ సెక్రటరీల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పసుపుల, పెద్దరాజుపాలెం, గులాంఅలియాబాద్, చెర్లోకొత్తూరు గ్రామాల్లో పల్లె పంచాయితీ వారోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు పంచాయితీ రాజ్ ఏఈ వెంకటరమణ, ఏపీఓ రేష్మా, టీఏ మగ్బుల్, టీడీపీ నాయకులు బాలనాయుడు, శేఖరప్ప, బాబయ్య, రంగస్వామి, జయరామిరెడ్డి, నరసింహులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే అఖిలప్రియ



అహోబిలంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆళ్లగడ్డ మండల పరిధిలోని అహోబిలం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆమె సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ ప్రతి మండలంలో రూ.2.5 కోట్లతో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే సర్పంచ్‌ల అకౌంట్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రం, కేంద్రం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకుని గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి పరచడమే తమ ముందున్న లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో అనీఫ్ ఖాన్, హౌసింగ్ పీడీ వెంకట సుబ్బయ్య, పీఆర్ డీఈ నరసింహుడు, ఏఈ కమాల్ సాహెబ్, ఏపీవో గణేష్, టీడీపీ నాయకులు రమణ, రామాంజనేయులు, వీరభద్రుడు, గంగాధర్, సంజీవరాయుడు పాల్గొన్నారు.

● దిగువ అహోబిలంలో ఎమ్మెల్యే అఖిలప్రియ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి వారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అమృతవల్లి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఎమ్మెల్యే అఖిలప్రియకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చాగలమర్రి: గ్రామాల అభివృద్ధి పరచడం కోసమే ప్రభుత్వం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను ప్రవేశ పెట్టిందని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకిర్‌హుసేన్ తెలిపారు. సోమవారం మండలంలోని చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంజులవాణి, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏపీవో నిర్మల, టీడీపీ నాయకులు కేశాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఓబయ్య, నర్సయ్య, రమణారెడ్డి, పాల షరిఫ్, మురళీ, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సులోచన, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉయ్యాలవాడ: మండంలోని అన్ని గ్రామాల్లో పల్లె పండుగలు ప్రారంభించామని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఎస్.కొత్తపల్లె, అల్లూరు, మాయలూరు, రూపనగుడి గ్రామాల్లో ఉపాధి ఏపీడీ సాంబశివరావుతో కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎస్.కొత్తపల్లె గ్రామ సర్పంచ్ సదర్శన్‌రెడ్డి, అల్లూరు గ్రామ ఉప సర్పంచ్ బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలో అవసరమైన ప్రతి గ్రామంలో కూడ ప్రభుత్వం సిమెంటు రోడ్లు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని కలచట్ల, పెద్దపూదిళ్ల, ప్యాపిలి, పోతుదొడ్డి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోవెలకుంట్ల : పల్లెపండుగ ప్రగతికి అండగా కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కోవెలకుంట్ల మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి, ఎంపీడీవో వర ప్రసాద్, ఈవోపీఆర్‌డి ప్రకాశ్‌నాయుడులు పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని అమడాల, సౌదరిదిన్నె, గుంజలపాడు గ్రామాల్లో పనులు చేపట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీఅధ్యక్షులు అమడాల మద్దిలేటి, సౌదరిదిన్నె సుబ్బారెడ్డి, గుంజలపాడు సుబ్బారెడ్డి, గోవిందరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమితోనే పల్లెల ప్రగతి

కొలిమిగుండ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే పల్లెల ప్రగతి సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పేట్నీకోట, గొర్విమానుపల్లె, బెలుం, బెలుంశింగవరం గ్రామాల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో గొంగటి హుస్సేన్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, పీఆర్ ఏఈ అన్వర్‌భాషా, పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి, నాయకులు పోక్లేయిన్ చంద్రశేఖరరెడ్డి, సత్యారెడ్డి, శివారెడ్డి, బెలుంలో పోతిరెడ్డి రాఘవరెడ్డి, హుసేనయ్య, బెలుం శింగవరంలో దోనపాటి శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.